నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 20 నవంబర్ 2024 | KAMAREDDY

## గ్రామస్తుల ఆగ్రహం..

సిద్ధాపూర్ వద్ద ఉన్న క్వారీకి పెద్దఎత్తున ట్రాక్టర్లు వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందున్నారు. వే బిల్లుల పేరిట ఇసుక దందా చేసేందుకే ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు వస్తున్నాయన్న అనుమానాలను వారు వ్యక్తంచేస్తున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారని, అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నదని చెబుతున్నారు. గత గురువారం సిద్ధాపూర్‌కు చెందిన ట్రాక్టర్ల యజమానులు బయటి ప్రాంతాల నుంచి వేబిల్లులతో వచ్చిన ట్రాక్టర్లను నిలిపివేయడంతో.. ఒకింత ఉద్రిక్తత ఏర్పడింది. నిబంధనలు కచ్చితంగా అమలుచేయకపోవడంతోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. కాగా, విచ్చలవిడిగా ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని సిద్ధాపూర్, కల్దుర్కి ప్రాంతం ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

## 12 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్ రూరల్, నవంబర్ 19: బోధన్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 12 ట్రాక్టర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రాత్రి సమయంలో ఇసుక రవాణాపై ఆంక్షలు ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో బోధన్ రూరల్ పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు 12 ట్రాక్టర్లను పట్టుకున్నారు. 6 ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి, మిగతా ఆరు ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విఠల్ హెచ్చరించారు.



బోధన్ పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా ఇసుక తరలించిన వాహనాలు

# మాది వికాసం.. మీది విధ్వంసం

- కాంగ్రెస్ సర్కారుపై జనం ఉమ్మేస్తున్నారు
- ప్రజల్లోకి వెళ్లి హామీలపై అడుగుదాం
- కాలేదంటే నువ్ రాజీనామా చేస్తావా?
- ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు చేస్తుండ్రు
- అమలయ్యాయని చెబితే రాజీనామా చేస్తా
- పీసీసీ చీఫ్ మహేశ్‌కు ఎమ్మెల్యే వేముల సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 19: కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, పిల్లల నుంచి వృద్ధుల దాకా అందరూ ఉమ్మేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పదేండ్లలో మేము చేసింది వికాసం.. పది నెలల పాలనలో మీరు చేసింది విధ్వంసమని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాతో కలిసి వేముల విలేకరులతో మాట్లాడారు. 'పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అహంకారం నెత్తికెక్కింది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చక్కబెట్టకుండా చిలుక జోస్యం చెబుతుండు. 11 నెలల కాంగ్రెస్ పాలనపై ఏ ఒక్కరినీ అడిగినా ఛీ, తూ అని తిడుతుండ్రు. హరీశ్‌రావు నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని గడ్డిపరక మాదిరిగా వదులుకున్నాడు. ఆయన గురించి నువ్వు మాట్లాడతావా? ఏ ఊరికెళ్దామో చెప్పు.. మహేశ్‌కుమార్‌గౌడ్.. నీకు దమ్ముంటే జిల్లాలో ఏ ఊరు వెతుక్కుంటావో వెతుక్కో. నేను కూడా వస్తా. అక్కడి సెంటర్‌లో ఇద్దరం నిలబడి ప్రజలను అడుగుదాం. రూ.2 లక్షల రుణమాఫీ అయిందా? రైతుబంధు వచ్చిందా? రూ.500 బోనస్ ఇచ్చిండ్రా? పింఛన్లు పెంచిండ్రా? అని అడుగుదాం. ఇవన్నీ అమలవుతున్నాయని చెబితే నేను రాజీనామా చేస్తా. లేకపోతే నువ్ పీసీసీ అధ్యక్ష పదవి రాజీనామా చేస్తావా? అని ప్రశ్నించారు.

**ఢిల్లీకి మూటలు మోస్తుండ్రు..**

రేవంత్‌రెడ్డి కుర్చీని కాపాడుకునేందుకు ఢిల్లీకి మూటలు మోస్తుండు. ఆయన లెక్కనే మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క కూడా సీఎం పదవి కోసం మూటలు మోస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రేవంత్‌రెడ్డిని గద్దె దించే అవకాశమున్నది. సీఎం పదవి నుంచి తొలగించగానే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉండడు.

**విజయోత్సవాలు ఎందుకు?**

పది నెలల్లో మీరు చేసింది విధ్వంసం. మేము చేసింది వికాసం. కాంగ్రెస్ పాలనలో పొద్దున లేస్తే ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు కనిపిస్తున్నాయి. మూసీ బాధితులు రోడ్డెక్కుతున్నారు. బడిలో చదువుకునే పిల్లల నుంచి వృద్ధుల దాకా రోడ్లెక్కుతున్నారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు.

**అన్నీ అబద్ధాలే..**

రేవంత్ లెక్క దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇన్ని తిట్లు తినలేదు. ఇంకా సిగ్గు లేకుండా మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు చెబుతుండు. మహారాష్ట్రలో మహిళలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తామని చెబుతుండ్రు. తెలంగాణలో ఇస్తామన్న రూ.2,500 పింఛన్‌కే దిక్కులేదు. కోతల రాయుడు రేవంత్‌రెడ్డి.. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను ముంచి విజయోత్సవాలు చేస్తున్నారు. దమ్ము, ధైర్యముంటే ముందు హామీల అమలుపై రేవంత్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని' వేముల డిమాండ్ చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, తెలంగాణ శంకర్, సత్యప్రకాశ్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'దాడి వెనుక కాంగ్రెస్ కుట్ర..'

మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్ మేయర్ భర్త, బీఆర్‌ఎస్ నేత శేఖర్‌పై దాడి వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తముందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నిందితుడి దాడిలో గాయపడి ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న శేఖర్‌ను మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి ఆయన మంగళవారం పరామర్శించారు. అనంతరం వేముల, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా విలేకరులతో మాట్లాడుతూ.. శేఖర్‌పై పాశవిక దాడి జరిగిందన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధితోపాటు శాంతిభద్రతల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. చంపాలనే కోరికతోనే నిందితుడు దాడి చేసి, వీడియో రికార్డు చేసి బయట పెట్టాడన్నారు. నిందితుడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక కాంగ్రెస్ హస్తముందని, కుట్ర కోణంపై దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు.



దవాఖానలో దండు శేఖర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేముల, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

## వేబిల్లులు లేని ఇసుక ట్రాక్టర్లపై చర్యలు

"ఇసుక క్వారీల్లో నిబంధనలు పాటించేలా రెవెన్యూ సిబ్బంది చూస్తున్నారు. ఏవైనా ఉల్లంఘనలు ఉంటే చర్యలు ఉంటాయి. వే బిల్లులు లేని ఇసుక ట్రాక్టర్లపై నిఘా ఉంచాం.. రెండురోజుల క్రితం ట్రాక్టర్ల వేబిల్లులను తనిఖీలు చేశాం. ఒక ఇసుక ట్రాక్టర్ వేబిల్లు లేకుండా వెళ్తుండగా తనిఖీచేసి సీజ్ చేశాం.. వే బిల్లులు లేకుండా ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం..

- విఠల్, బోధన్ తహసీల్దార్

**బోధన్ మండలంలో** ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. 'మంజీరా'ను తోడేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. స్థానిక అవసరాల కోసం అనుమతించిన క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. వే బిల్లులు లేకుండానే యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

## క్వారీల్లో అక్రమాల జాతర

# నిబంధనలకు పాతర

- దోజర్లతో ఇసుకను నింపుతున్న వైనం
- వేబిల్లులు లేకుండానే ట్రాక్టర్లను నింపుతున్నారన్న ఆరోపణలు
- క్వారీకి వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మంజీరాను తోడేస్తున్నారు..




బోధన్, నవంబర్ 19 : మంజీరా నది తీర ప్రాంతంలో బోధన్ మండలంలోని సిద్ధాపూర్ వద్ద ఇసుక క్వారీలు రెండు రోజుల క్రితం ప్రారంభంకాగా, ప్రారంభంలోనే అన్ని నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు.

స్థానిక అవసరాల కోసం ఇసుకను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధాపూర్ వద్ద రెండు క్వారీలకు అనుమతి ఇచ్చింది. ఈ రెండింటిలో ఒకటి సిద్ధాపూర్ వద్ద ఉండగా, మరొకటి సిద్ధాపూర్– ఖండ్‌గావ్ గ్రామాల మధ్య ఉంది. సిద్ధాపూర్ క్వారీలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాకు ఉద్దేశించినది కాగా, రెండో క్వారీ టిప్పర్లలో ఇసుక నింపేందుకు అనుమతి ఇచ్చారు. ఈ రెండు క్వారీల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభంకాగా, నిర్వాహకులుగా వ్యవహరిస్తున్న కొంత మంది నిబంధనలకు పాతరేసి తమ ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. తహసీల్దార్ జారీచేసే వే బిల్లుల వాహనాలకు ఇసుక ఇస్తున్నప్పటికీ, కొన్ని వాహనాల్లో వే బిల్లులు లేకుండానే ఇసుకను నింపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. బోధన్ తహసీల్దార్ సిద్ధాపూర్ నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లను తనిఖీచేస్తుండగా వేబిల్లు లేకుండా ఇసుక తీసుకెళ్తున్న ఒక ట్రాక్టర్ పట్టుబడడం ఇందుకు నిదర్శనం. గతంలో కూడా సిద్ధాపూర్‌లోని ఒక క్వారీలో వెలుగుచూసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు.. ఇప్పుడు కూడా అదే తీరుతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక, మంజీర తీరాన సిద్ధాపూర్ – ఖండ్‌గావ్ గ్రామాల సమీపంలో ఉన్న క్వారీలో టిప్పర్లను నింపేందుకు అనుమతి ఇచ్చారు. అయితే, ఈ క్వారీలో జరిగే ఇసుక తవ్వకాల్లో నిబంధనలను పాటించడంలేదు. నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు, లోడింగ్ చేయడం కూలీల ద్వారా జరగాలి.. క్వారీలో యంత్రాలు వాడరాదు. కానీ ఈ క్వారీలో జేసీబీలు, డోజర్లతో ఇసుకను నింపుతుండడం గమనార్హం. ఇసుక తవ్వకాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సిన రెవెన్యూ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండం గమనార్హం. ఇది ప్రభుత్వ క్వారీ అయినందున నిర్వహణలో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీ ఎంతమాత్రం ఉండకూడదు. ఇక్కడ మాత్రం ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అజమాయిషీ చేయాల్సిన రెవెన్యూ సిబ్బంది నిబంధనల ఉల్లంఘనులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు అంటున్నారు. క్వారీ వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది ఉదాసీనతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభంలోనే ఇసుక తవ్వకాలను ఇష్టానుసారంగా జరుపుతున్నారంటే.. ముమ్ముందు ఇసుక తవ్వకాలు మరింత ఘోరంగా మారుతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

## మేయర్ భర్తపై దాడి ఘటనలో

# నిందితుడి అరెస్టు

### రిమాండ్‌కు తరలింపు

వినాయక్‌నగర్, నవంబర్ 19: నిజామాబాద్ నగర మేయర్ నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌పై సోమవారం దాడికి పాల్పడిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. మేయర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు షేక్ రసూల్ పై అటెమ్ట్ టూ మర్డర్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగారంలోని 80 క్వార్టర్స్ ఏరియాలో నివాసం ఉంటున్న షేక్ రసూల్‌కు అదే ప్రాంతంలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలం విషయంలో మూడేండ్లుగా దండు శేఖర్‌తోపాటు అతడి అనుచరులైన గోపాల్, తిరుపతితో గొడవలు ఉన్నాయి. షేక్ రసూల్ ఏడాది కాలంగా దండు శేఖర్ కార్యాలయానికి వెళ్లి తన ప్లాట్ విషయంలో సెటిల్ చేయాలని అడుగుతూ వస్తున్నాడు. తన ప్లాట్ విషయంలో అడ్డురావొద్దంటూ శేఖర్‌తో చెప్పినప్పటికీ గోపాల్, తిరుపతి బెదిరింపులకు గురిచేశారు. దీంతో రసూల్ ఎలాగైనా గోపాల్, శేఖర్‌ను చంపితే ప్లాటు విషయంలో తనకు అడ్డురారని భావించాడు. సోమవారం సాయంత్రం గోపాల్ కోసం వెతకగా అతడు దొరకలేదు. అదే సమయంలో దండు శేఖర్ నాగారం 80 క్వార్టర్స్ ప్రాంతంలో మున్సిపల్ ఆఫీసర్లతో మాట్లాడుతుండగా రసూల్ అక్కడికి వచ్చి దాడి చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. సుత్తితో దాడిచేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన నిందితుడు షేక్ రసూల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సుత్తితోపాటు సెల్‌ఫోన్, ఆటో రిక్షాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రసూల్ దాడి చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన వెల్డింగ్ అహ్మద్‌కు సైతం నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్,ఐదో టౌన్, మాక్లూర్ ఎస్సైలు గంగాధర్, రాజశేఖర్‌ను ఏసీపీ అభినందించారు.

## రోగి బంగారు నగలు అపహరణ

### నిజామాబాద్ జిల్లా దవాఖానలో ఘటన

వినాయక్‌నగర్, నవంబర్19: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో మంగళవారం దుండగులు చేతివాటం ప్రదర్శించి ఓ రోగి బంగారు నగలను ఎత్తుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలానికి చెందిన ఓ మహిళ శస్త్రచికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వచ్చింది.సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లే ముందు తన ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు నగలను తీసి వార్డులో ఓ పక్కన పెట్టింది. సర్జరీ అనంతరం వచ్చి చూడగా నగలు కనిపించకపోవడంతో, ఆమె కుటుంబీకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దవాఖానకు చేరుకొని వార్డుతో పాటు ఇతర చోట్ల పరిశీలించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దవాఖానలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## నేత్రాలను పరిరక్షించుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

వినాయక్‌నగర్, నవంబర్ 19: మనిషికి నేత్రాలు ప్రధానమని, వాటిని పరిరక్షించుకోవాని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి దవాఖాన వారి సౌజన్యంతో న్యాయవాదులకు మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా జడ్జి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మరణానంతరం నేత్రాలను దానం చేయొచ్చని, వాటితో మరొకరు ప్రపంచాన్ని చూడగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌తో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి గవర్నమెంట్ ప్లీడర్ వెంకటరమణా గౌడ్, న్యాయవాదులు రాజు, లక్ష్మణ్, కవితా రెడ్డి, అంజలి, రజిత, నారాయణ, రాణాదేశ్, మాణిక్ రాజ్, విగ్నేష్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్యులు శరత్ జోషి, చరణ్ గౌడ్, గణేశ్, సంజయ్, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

# నేటి నుంచి కాలభైరవస్వామి జన్మదిన వేడుకలు

### రామారెడ్డిలో ముస్తాబైన ఆలయం



రామారెడ్డి, నవంబర్ 19: మండలంలోని ఇసన్నపల్లి–రామారెడ్డి గ్రామంలో వెలసిన కాలభైరవస్వామి జన్మదిన వేడుకలు నేటి నుంచి నిర్వహించనున్నారు. ఈ నెల 24 వరకు ఉత్సవాలు నిర్వహించనుండగా..ఇందుకోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. జన్మదిన వేడుకలకు భక్తులు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్నారు. కాలభైరవస్వామిని దర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఎన్నో కష్టాలకోర్చి భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తుండగా.. దర్శన భాగ్యంతో తరించిపోతారు. ఆలయంలో ప్రతి మంగళవారం విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొదటి రోజు ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభించనున్నారు.



విద్యుద్దీపాలతో ముస్తాబైన ఆలయం

## 'బేడ బుడగ జంగం'గా గుర్తించండి

### మాచారెడ్డి 'తహసీల్' ఎదుట కులస్తుల ఆందోళన

మాచారెడ్డి, నవంబర్ 19 : తమను బేడ బుడగ జంగంగా గుర్తించి, ధ్రువపత్రాలు అందజేయాలని కోరుతూ మాచారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట కులస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమకు ఇచ్చిన కులం సర్టిఫికెట్లను వాపస్ ఇవ్వాలని తహసీల్దార్ శ్వేత ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. చుక్కాపూర్ గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నాయని, తమకు తెలియక గోసంగులుగా కొనసాగామని తెలిపారు. తమది అసలు కులం బేడ బుడగ జంగం అని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. ఇటీవల కొంత మంది కులం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇచ్చారని, మరికొంత మందికి ఇవ్వకుండా కార్యాలయంలో వేధిస్తున్నారని ఆరోపించారు. చుట్టుపక్కల అన్ని మండలాల్లో బేడ బుడగ జంగం కులం సర్టిఫికెట్లు తమ బంధువులకు ఇస్తున్నారని, కొత్తగా ఏర్పడిన పాల్వంచ మండలంలో కూడా ఇచ్చారని తెలిపారు. మాచారెడ్డి మండలంలో ఇచ్చిన సర్టిఫికెట్లను వాపస్ ఇవ్వాలంటూ వేధిస్తున్నారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కల్లెం లక్ష్మీపతి,కల్లెం రవి, ఎల్లం, నాగరాజు, నర్సయ్య, బాలమల్లు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బేడ బుడగ జంగం కులస్తులు

